క్లుప్తంగా

గాన గంధర్వుడు బాలు పాట సజీవం

రాజంపేట రూరల్ : గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన పాటలు సజీవంగా ఉంటాయని సీనియర్ గాయకుడు ఎస్. కళాంజలి పేర్కొన్నారు. స్థానిక బీవీఎన్ పాఠశాలలో గురువారం కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బాలసుబ్రమణ్యం చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలాపన ఆర్కెస్ట్రా నిర్వాహకులు సునీల్, పెంచలయ్యలతో గాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నందలూరు : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రాధాకృష్ణ, సర్పంచ్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని ప్రధాన రహదారులను అధికారులు, నాయకులు, కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి పంచాయతీ కార్మికులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సునీల్‌కుమార్, కార్యదర్శులు సురేష్, రమణ, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీఓ కుటుంబానికి ఆర్థిక సాయం

రాయచోటి జగదాంబసెంటర్ : పెనగలూరు మండలంలో ఏపీఓగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు జూన్ నెలలో మరణించారు. అన్నమయ్య జిల్లా ఏపీఓల సంక్షేమ సంఘం, ఏపీడీలు, అన్నమయ్య జిల్లా ఉపాధి సిబ్బంది తరఫున రూ.2,94,821లను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు వెంకటరత్నం చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు సురేంద్రరెడ్డి, మృత్యుంజయరావు, మురళి, సాలయ్య, మాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి దీన్ దయాళ్ ఉపాధ్యాయ

గాలివీడు : సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా స్వాతంత్ర్య ఫలాలు అందాలని నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ నాయకులు కొనియాడారు. గురువారం దీన్ దయాళ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వృత్తి విద్య ద్వారా స్వయం ఉపాధి

రాయచోటి టౌన్ : వృత్తి విద్యద్వారా స్వయం ఉపాధి లభించడంతో పాటు మరి కొంత మందికి ఉపాధి కల్పించవచ్చని రాయచోటి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ తెలిపారు. గురువారం వృత్తి విద్య శిక్షకురాలు టి.సరిత (ఆటోమోటివ్ విభాగం) ఆధ్వర్యంలో బజాజ్ ఆటో సంస్థ సర్వీస్ కేంద్రం, యమహా ఆటో సంస్థ సర్వీస్ కేంద్రం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ బి. సుమతి, జిల్లా వృత్తి విద్య సమన్వయ కర్త ఆర్. కమలాకర్, యోగీశ్వరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచండి

పెనగలూరు : పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సిడీపీఓ నిర్మలజోతి అన్నారు. చక్రంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల సందర్భంగా అంగన్ వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, సమతుల భోజనం, ప్రతిరోజూ వ్యాయామం, సరైన నిద్ర, మానసిక సానుకూలత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు వసుంధరమ్మ, సురేఖ, రాణి, విజయ కుమారి, అంగన్ వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ రహదారి.. గుంతలే మరి!

- ప్రాణాంతకంగా కడప- చెన్నై జాతీయ రహదారి
- దారి పొడవునా భారీ గుంతలు
- భయాందోళనలో ప్రయాణికులు



ముక్కావారిపల్లె సమీపంలో వంతెన వద్ద ఏర్పడిన గుంత

ఓబులవారిపల్లె : కడప–చెన్నై జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. దారి పొడవునా భారీ స్థాయిలో గుంతలు ఉండటంతో ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు..

జాతీయ రహదారిపై దగ్గరకు వచ్చేంతవరకు గుంత కనిపించకపోవడంతో ద్విచక్రవాహనదారులు అకస్మాత్తుగా గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీ స్థాయిలో పెరగడం, భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతుండడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఇటీవల చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో గుంతలను తప్పించబోయి ప్రైవేటు వాహనం ఢీ కొనడంతో మంగళంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.

పట్టించుకోని అధికారులు, నాయకులు..

ఎప్పుడూ రద్దీగా ఉండే జాతీయ రహదారిపై అధికారులు, నాయకులు కార్లలో దర్జాగా తిరుగుతున్నారు. రాజంపేట నుంచి కుక్కల దొడ్డి వరకు జాతీయ రహదారిపై గుంతలు ఉండటాన్ని గమనిస్తూ కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి. కొంతమంది ప్రాణాలు కోల్పోతుంటే మరికొందరు క్షతగాత్రులు అవుతున్నారు. మృతి చెందిన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇవన్నీ చూస్తూ కూడా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ఉన్న భారీ గుంతలు పూడ్చి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

రాత్రి సమయంలో కనిపించలేదు..



బైకుపై రాత్రి సమయంలో రాజంపేట నుంచి వస్తుంటే రెడ్డిపల్లి కట్టపై ఉన్న భారీ గుంత కనిపించలేదు. బండి గుంతలో పడి అదుపు తప్పింది. టైరు పగిలిపోయింది. ఆ సమయంలో పక్కన వాహనాలు రాకపోవడంతో నా ప్రాణాలు దక్కాయి. ఇప్పటికైనా గుంతలు పూడ్చండి.

– సయ్యద్ సలీం పీరా, వ్యాపారి, ఓబులవారిపల్లి.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..



జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలు జరిగి చాలా మంది చనిపోతున్నారు. దారి పొడవునా గుంతలు ఉండటంతో ప్రమాదాలు ఇంకా ఎక్కువ అవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని గుంతలను పూడ్చండి.

– పసుపులేటి సుబ్బరాయుడు, రైతు, ఎల్లాయపల్లి, ఓబులవారిపల్లి.

మాజీ ఎమ్మెల్యే నివాళులు



గొట్లమిట్ల వంశీధర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గాలివీడు మండలం అరవీటివాండ్లపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గొట్లమిట్ల వంశీధర్ రెడ్డి మృతదేహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. బుధవారం ఆయన బెంగళూరులో మృతి చెందగా, మృతదేహాన్ని గురువారం స్వగ్రామమైన అరవీటివాండ్లపల్లెకు తీసుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి మృతుడి స్వగ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హరూన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన డేవిడ్ రెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అయన వెంట జాఫర్ ఆలీఖాన్, అల్తాఫ్, జయచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

పరామర్శ

గాలివీడు : అనారోగ్యంతో బాధపడుతున్న గాలివీడు మండలం వెలిగల్లుకు చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు, మైనారిటీ నాయకుడు బాబా ఫక్రుద్దీన్‌ను గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకుని మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

సంబేపల్లి : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం ముదినేని వడ్డిపల్లెకు చెందిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడి కుమారుడు రాజు గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి ముదినేని వడ్డిపల్లెకు చేరుకొని రాజు మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ డైరెక్టర్ షేట్ వెంకట్రామిరెడ్డి, బీసీ నాయకుడు నాగరాజు యాదవ్, శ్రీనివాసులు ఉన్నారు.

జ్యోతి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి



జ్యోతి క్షేత్రాన్ని సందర్శించిన దక్షిణ భారత పర్యాటక సంస్థ సభ్యులు

సిద్దవటం : పురాతన జ్యోతి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవాధ్యక్షుడు సట్టి భారవి కోరారు. సంస్థ సభ్యులు గురువారం జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్షేత్రం అభివృద్ధి విషయంలో శ్రీశైలం దేవస్థానం అధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్షేత్రానికి చెందిన 100 ఎకరాల మాన్యం భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జ్యోతి జార్జి, కార్యదర్శి శ్రీనివాసులు, ఆది మహాలక్ష్మీ దేవాలయం అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, శ్రీ జగన్మాత మారెమ్మ దేవాలయ ధర్మకర్త సట్టి భాస్కర, వరప్రసాద్, స్థానిక శైవ భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పునరావాస గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ యామినీ రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులతో తహసీల్దార్ యామినీ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పరిహారం రావాల్సిన వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్నారు. ఆర్ఆర్–5 పునరావాస కాలనీలో అన్ని వసతులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తే గ్రామం ఖాళీ చేసి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులకు ఇంటి పట్టాలు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, మూడు గ్రామాలకు సంబంధించి స్మశాన వాటిక తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ యామినీ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. మూడు గ్రామాలు ఖాళీ చేసి పునరావాస కాలనీలో గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వర రావు, ఆర్ఐ మల్లికార్జున రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, వడ్డి సుబ్బారెడ్డి, దేవకుమార్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజసేవకు గొప్పవేదిక ఎన్‌సీసీ



ఎన్‌సీసీ ఎంపికల ప్రక్రియ నిర్వహిస్తున్న తిరుపతి ఎన్‌సీసీ అధికారులు

రాజంపేట : విద్యార్థి దశ నుంచి సమాజసేవకు గొప్పవేదిక ఎన్‌సీసీ అని తిరుపతి ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అంజు వాద్వా అన్నారు. గురువారం అన్నమాచార్య యూనివర్సిటీలో ఎన్‌సీసీ ఎంపికలను పర్యవేక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, నాయకత్వ నైపుణ్యాలను ఎన్‌సీసీ ద్వారా పెంపొందించుకోవాలన్నారు.

విజయవంతంగా ఎన్‌సీసీ ఎంపికలు

ఏయూలో ఎన్‌సీసీ ఎంపికలు విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి ఎన్‌సీసీ నుంచి 5 (ఏ). (గరల్స్ బెటాలియన్) కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అంజువాద్వా, నైబ్‌సుబేదార్, వెంకటేశ్, గ్లర్ కేడిట్ ఇన్‌స్ట్రక్టర్ అర్చన ఎన్‌సీసీ ఎంపికలను పర్యవేక్షించారు. క్యాంప్‌లో 218 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 71 మంది ప్రతిభావంతులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏయూ వైస్ చాన్సలర్ డాక్టర్.సాయిబాబా, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ, పీడీ నాగముని, ఎన్‌సీసీ సీటీఓ దీప్తి, డీన్స్, హెచ్‌ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం



కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సిద్దవటం : మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు మంచి ఆహారం తీసుకున్నప్పుడు రక్తహీనతను నివారించి సుఖప్రసవం జరుగుతుందన్నారు. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల ఏడు రకాల వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు వైద్యాధికారి సిబ్బంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ నిఖిల, డాక్టర్.అబ్దుల్ కలీఫ్, డాక్టర్ సుశిత, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ రవికిశోర్, డాక్టర్ శ్యామల, మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు, పీహెచ్ఎస్ కళావతి, సూపర్‌వైజర్ రమణయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ జయవాణి, అసిస్టెంట్ సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పోషణ కార్యక్రమం నిర్వహిస్తున్న సీడీపీఓ రేణుక

పుల్లంపేట : చిరుధాన్యాలు ప్రతి రోజు తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ ఎస్.రేణుక తెలిపారు. మండల పరిధిలోని కోనయ్యగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను రక్త హీనత నుంచి రక్షించుకునేందుకు మంచి ఆహారపు అలవాట్లు అవసరమన్నారు. అంగనవాడీ కేంద్రాలలో అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సరళాదేవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పి.పార్వతీదేవి, ఎం.జయలక్ష్మమ్మ, ఏఎన్ఎం నూరీ, ఆశాలు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా తయారు చేయాలి

పుల్లంపేట : అటెండర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ వరకు సీనియారిటీ జాబితా తయారు చేసి ప్రదర్శించాలని ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఆర్‌జేడీని కలిసి వినతి పత్రం అందజేశారు. జాబితా తయారు చేసిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించి రోస్టర్ పాయింట్ ద్వారా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హడాక్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ శ్రీనివాసులు, ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి సూచిక 2.0పై శిక్షణ

గాలివీడు : మండలస్థాయి పంచాయతీ అభివృద్ధి సూచికపై 2.ఓపై శుక్రవారం ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నందలూరు : మండలంలోని పొత్తపి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్లం రెడ్డి రమణారెడ్డి (బుజ్జిరెడ్డి) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, పొత్తపి ఎంపీటీసీ మోదుగుల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

నందలూరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి కార్తీక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. స్పెషల్ క్యాంప్‌లో భాగంగా గురువారం ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లోని విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రమేష్, సురేష్, వసంత పాల్గొన్నారు.

కోదండరాముడి సన్నిధిలో శ్రీశైలం దేవస్థానం చైర్మన్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సత్కరించారు. ఆయన వెంట ఒంటిమిట్ట చెరువు అధ్యక్షుడు పాటూరి గంగిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు భాను ప్రకాశ్ రాజు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బాలరాజు శివరాజు, నాయకులు గురూజీ వర్మ, రామయ్య, జేకే నాగరాజు, పాపయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండులో స్వచ్ఛత హీ సేవ

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండులో పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ–స్వచ్ఛ్ వోత్సవ్–2025 కార్యక్రమం గురువారం నిర్వహించారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండు పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఇన్‌చార్జి డీఎం మాధవీలత, ఇన్‌చార్జి శానిటరి ఇన్స్పెక్టర్ హర్షవర్ధన్, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మున్సిపాలిటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు వితరణ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నారాయణరాజుపేట గ్రామ సమీపంలో వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి రాజంపేటకు చెందిన తాళ్లపాక వెంకటేష్ఆచారి, లక్ష్మీ తనిష్క దంపతులు గురువారం ఆలయ ధర్మకర్త సర్వేశ్వర ఆచారికి రూ.1.30 లక్షలు విలువ చేసే వెండి ఆభరణాలు నాగపడిగ, వెండి శూలం, వెండి విభూతి రేఖలను అందజేశారు. తాళ్లపాక రాజాచారి భార్య దివంగత తాళ్లపాక శాంతమ్మ జయంతి సందర్భంగా ఆమె కుమారుడు ఈ వితరణ చేశారు.

అమ్మ రూపం.. దివ్య తేజం

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం వివిధ ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తరించారు.



రాయచోటి టౌన్ : అన్నపూర్ణేశ్వరీ దేవి రూపంలో భద్రకాళీ అమ్మవారు



రాయచోటి : పార్వతీ దేవి అలంకరణలో శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవారు



రాయచోటి టౌన్ : బాలా త్రిపుర సుందరి రూపంలో పార్వతీ దేవి



లక్కిరెడ్డిపల్లె : కాత్యాయనీ దేవి అలంకారంలో అమ్మవారు



చిన్నమండెం : అన్నపూర్ణాదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి



సిద్దవటం : కాత్యాయని దేవి అలంకరణలో శ్రీ దుర్గాదేవి



ఒంటిమిట్ట : గజలక్ష్మీ దేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి



సుండుపల్లె : కాత్యాయనిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



నందలూరు : కృష్ణమూర్తి అలంకారంలో కన్యకా పరమేశ్వరి



గాలివీడు : కాత్యాయినీదేవి అలంకారంలో ఇరుగులమ్మ తల్లి



రాజంపేట టౌన్ : ధనలక్ష్మీ అలంకారంలో చౌడేశ్వరీదేవి



రాజంపేట టౌన్ : కాశీ అన్నపూర్ణగా మారెమ్మ